క్లుప్తంగా

వత్సవాయమ్మకు బోనాలు సమర్పణ



వత్సవాయి : గ్రామంలో వేంచేసియున్న శ్రీరామ జగపతి దేవసమేత శ్రీవత్సవాయమ్మ తల్లికి గ్రామస్తులు సోమవారం ఉన్నవూరు బోనాలను సమర్పించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ప్రభలను కట్టుకొని వచ్చి, రైతులు పండించిన పంటను అమ్మవారి దగ్గర పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు పటిష్ట చర్యలు చేపట్టారు. ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మునేరు ప్రాంతం



పెనుగంచిప్రోలు: మండలకేంద్రంలోని మునేరు ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ముఖ్యంగా అమ్మవారి చిన్నతిరునాళ్లకు వచ్చిన యువతతోపాటు మైనర్లను సైతం ఆకర్షిస్తూ పలువురు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. వీరిలో మహిళలతోపాటు మరికొందరు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్లు సమాచారం. మునేరు మధ్యలో ఉన్న చెట్ల పొదలు, పక్కన ఉన్న మామిడి తోటను కేంద్రంగా చేసుకుని వీరు ఈ అసాంఘిక కార్యక్రమాలను సాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో తిరునాళ్ల సమయంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ ట్రాన్స్‌జెండర్ మామిడి తోటలో హత్యకు గురైన సంఘటన విదితమే. ఇప్పటికైనా పోలీసులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వత్సవాయి: స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం టెరోవా మిర్చి కంపెనీ వారు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.70లక్షలతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. ప్లాంట్‌కు రూ.60వేలు విలువచేసే షెడ్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు, పొట్టి శ్రీరాములు సేవాత ట్రస్టు వారి సహకారంతో నిర్మించారు. ఈసందర్భంగా కంపెనీ ప్రతినిధి ఏలూరి సురేష్, దాతలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే జరీనా సన్మానించారు.

ఉపాధి కూలీలకు తాగునీటి వసతి



సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల : ఉపాధి కూలీలకు తాగునీటి వసతి కల్పించకపోతుండటంతో వారు పడుతున్న ఇబ్బందులపై 'ఎండలకు ఉపాధి కూలీలు విలవిల' శీర్షికన ఈనెల 16వతేదీన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి అధికారులు సోమవారం స్పందించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తాగునీటి వసతి కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. పనిచేసే ప్రాంతంలో కూలీలు సేదతీరేందుకు త్వరలోనే షామియానా వసతి కూడా కల్పిస్తామని ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు.

అనధికార లేఅవుట్లు వేస్తే చర్యలు : కమిషనర్

నందిగామరూరల్: పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. నందిగామ పట్టణంలోని పలు అనధికారిక రియల్‌ఎస్టేట్ వెంచర్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లేఅవుట్ల ఏర్పాటును సరళీకృతం చేసిందని, వెంచర్ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వెంచర్లకు సంబంధించి అన్ని అనుమతులు పొందిన తరువాతే విక్రయించాలన్నారు. అనధికారికంగా వేసిన వెంచర్లలోని రోడ్లతోపాటు సరిహద్దురాళ్లు తొలగిస్తామన్నారు. అనధికారిక లేఅవుట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి అనధికార లేఅవుట్లలో స్థలాలను కొనుగోలు చేస్తే, భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు కావని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ప్రసాద్, నిఖిత ఉన్నారు.

దొంగలకు షెల్టర్ జోన్!

- కంచికచర్ల మోడల్‌కాలనీ, నందిగామ డీవీఆర్‌కాలనీలే ఆవాసం
- పగలు రెక్కీ...రాత్రి వేళ దోపిడీలు
- పనిచేయని నిఘా నేత్రాలు
- నిద్రమత్తులో పోలీస్ యంత్రాంగం



గతేడాది కంచికచర్లలో చోరీకి గురైన ఓ జ్యూయలరీ షాపు (ఫైల్)

కంచికచర్ల: ఇతర ప్రాంతలకు చెందిన కొందరు పాతనేరస్తులు..దొంగలు.. కంచికచర్ల, నందిగామలను షెల్టర్‌జోన్‌గా మార్చుకుని చోరీలకు పాల్పడుతున్నారు. కంచికచర్లలోని మోడల్‌కాలనీ, నందిగామలోని డీవీఆర్ కాలనీలను వీరు షెల్టర్ కమ్ సేఫ్ జోన్లుగా మార్చుకుని నందిగామ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు అగంతకులు ఈ కాలనీల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వీరు పగటి పూట రెక్కీలు నిర్వహిస్తూ, రాత్రివేళల్లో ఆయా ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతుండటం గమనార్హం. ఇటీవల తెలంగాణ రాష్ట్రం కోదాడ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన దొంగ కంచికచర్ల మోడల్‌కాలనీలో ఉంటున్నట్లు ఇన్‌ఫార్మర్ ద్వారా తెలుసుకున్న తెలంగాణ పోలీసులు ఆ దొంగను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.12లక్షల నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం స్థానికులను కలవరపాటుకు గురిచేసింది. ఇలా ఓ దొంగ యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతూ మోడల్ కాలనీని షెల్టర్ జోన్‌గా చేసుకున్న వైనాన్ని తెలుసుకుని ఆందోళన చెందారు. ఇలా ఓ అగంతకుడు ఇక్కడ స్థావరం ఏర్పాటు చేసుకుని చోరీలకు పాల్పడుతున్నప్పటికీ స్థానిక పోలీసులు, వారి వేగులు కనిపెట్టలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా సోమవారం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్న నాగరాజు అనే దొంగ కూడా తెలంగాణలోని సూర్యాపేట ప్రాంతానికి చెందిన వ్యక్తే కావడం గమనార్హం.

కొలిక్కిరాని చోరీ కేసులు..

కంచికచర్లలో గతేడాది క్రితం పోలీస్‌స్టేషన్, సీఐ కార్యాలయానికి కూతవేటు దూరంలోని ఓ బంగారు దుకాణంలో రాత్రి పూట లక్షల విలువగల బంగారు ఆభరణాలు, కొంత నగదు దొంగలు దోచుకుని వెళ్లారు. మరుసటి రోజు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించారు. కాని చోరీకి పాల్పడిన వ్యక్తి మాత్రం ఏడాదిగా పోలీసులకు దొరక్కపోగా సదరు దుకాణదారు మాత్రం రికవరీ కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. కంచికచర్ల, నందిగామ పరిసర ప్రాంతాల్లో 50వరకు పలు రకాల దొంగతనాలు జరిగితే 30మాత్రమే రికవరీ అయ్యాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. సెల్‌ఫోన్ల అపహరణ, ఇళ్లముందు పార్కు చేసి ఉంచిన బైక్‌లు అపహరించడం, కర్మాగారాలు, విద్యుత్ మోటార్ల వద్ద ఇనుము, వైర్లు చోరీ, బడ్డీ కొట్లు, లారీల్లో పెట్రోలు, డీజిల్ ఆయిల్ దొంగతనాలు, లారీ టైర్ల దొంగతనాలు ఇలా అగంతకులు పలు చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో కొన్ని ఘటనపై మాత్రమే ఫిర్యాదులు పోలీసుస్టేషన్ దాకా చేరుతుండగా, అధికశాతం ఘటనలు పోలీసు ఫిర్యాదుల వరకు వెళ్లడం లేదని చెప్పవచ్చు. ఇలా నందిగామ, కంచికచర్ల ప్రాంతాలను షెల్టర్ కమ్ సేఫ్ జోన్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అగంతకుల సమాచారాన్ని ముందస్తుగా పసిగట్టి వారిని అదుపులోకి తీసుకోవడంలో స్థానిక పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని నందిగామ నియోజకవర్గంలో చోరీలను అరికట్టడంతో పాటు అపరిష్కృతంగా ఉన్న చోరీ కేసుల్లోని నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేరస్తులను పట్టుకుంటున్నాం..



దొంగతనాలు జరిగే ప్రాంతాలను గుర్తించి కంచికచర్ల మండలంలోని 150సీసీ కెమేరాలు ఏర్పాటు చేశాం. ఎంఎస్ఈడీ పరికరం ఉపయోగించడం ద్వారా పాత నేరస్తులను సులభంగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకుంటున్నాం. రాత్రి సమయంలో వెహికిల్ చెకింగ్‌లు చేస్తున్నాం. నైట్ బీట్ పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఈ-పహారా ద్వారా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తిస్తున్నాం. మరింత పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి చోరీలను నియంత్రిస్తాం.

– చవాన్‌దేవ్, సర్కిల్ సీఐ, కంచికచర్ల

తొలిరోజు ప్రశాంతంగా 'పది' పరీక్షలు



కంచికచర్లలో పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు



జగ్గయ్యపేటలో పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

నందిగామరూరల్/ కంచికచర్ల: నందిగామ డివిజన్‌లో తొలిరోజు సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డివిజన్‌లోని 40 పరీక్షా కేంద్రాలలో 6,035 మంది విద్యార్థులకుగాను 5,970 మంది పరీక్షలకు హాజరుకాగా, 65మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ డీవైఈవో సాంబశివరావు తెలిపారు. నందిగామ మండలంలో ఏర్పాటు చేసిన 11 పరీక్షా కేంద్రాలలో 1480మందికి గాను 1467మంది హాజరవగా 13మంది గైర్హాజరయ్యారు. కంచికచర్ల మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల పరిధిలో 908మందికిగాను 897మంది హాజరవగా 11మంది గైర్హాజరయ్యారు. చందర్లపాడు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 703మందికిగాను 692మంది హారజవగా 11మంది గౌర్హజరయ్యారు. వీరులపాడు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల పరిధిలో 426 మంది విద్యార్థులకుగాను 414 మంది పరీక్షకు హాజరవగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.అదేవిధంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 15 పరీక్షా కేంద్రాల పరిధిలో 2,518మంది విద్యార్థులకుగాను 2,500మంది హాజరవగా 18మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేటఅర్బన్ : పదోతరగతి పరీక్షలు జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజున తెలుగు పరీక్షకు 1,652 మంది విద్యార్థులు హాజరుకాగా, ఏడుగురు విద్యార్థులు గైర్హజరయ్యారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్–ఎ పరీక్ష కేంద్రంలో 160 మందికిగాను 160మంది, బాలుర హైస్కూల్–బి కేంద్రంలో 160 మందికిగాను 159మంది, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో 120మందికిగాను 120మంది, విజ్ఞాన్ హైస్కూల్‌లో 125మందికిగాను 125మంది, శ్రీచైతన్య స్కూల్‌లో 167మందికిగాను 167మంది, తపోవన్‌లో 220 మందికిగాను 220 మంది, చేగు విద్యాలయంలో 167మందికిగాను 167మంది, చిల్లకల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 150మందికిగాను 149మంది, చిల్లకల్లు ఆల్ సెయింట్స్ స్కూల్‌లో 154మందికిగాను 152మంది, గండ్రాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 236మందికిగాను 233 మంది విద్యార్థులు హాజయ్యారు. కొన్ని పరీక్ష కేంద్రాల్లో పరీక్ష గదుల వివరాలు.. హాల్ టికెట్ల నంబర్ల కేటాయించి వివరాలను ఆయా నోటీసు బోర్డులో సవివరంగా సూచించకపోవడంతో పలువురు విద్యార్థులు కొంతమేర ఇబ్బందిపడ్డారు. పేటలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎంఈవో ఎల్.చిట్టిబాబు తెలిపారు. సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పేట, చిల్లకల్లు ఎస్ఐలు జి.రాజు, వెంకటేశ్వరరావు, సూర్యశ్రీనివాస్ ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: పదోతరగతి పరీక్షలు సోమవారం వత్సవాయి మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 398మంది విద్యార్థులకుగాను 392మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఎల్.నాగరాజు తెలిపారు.

తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు



పొంగళ్లతో ఆలయ క్యూలైన్‌లో భక్తులు





అమ్మవారి ఆలయ ప్రదక్షిణకు బయలు దేరిన వైఎస్సార్ సీపీ ప్రభలు, బండ్లు



పసుపుకుంకుమ బండ్ల వద్ద కేరళ వాయిద్యాలు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్లకు నాలుగో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు,పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లుతోపాటు పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడుతోపాటు మండలంలోని ముచ్చింతాల, వెంకటాపురం, గుమ్మడిదూర్రు, శివాపురం గ్రామాల నుంచి ఎడ్లబండ్లతోపాటు చిన్న దూడలు, పొట్టేళ్ల బండ్లు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. సైకిళ్లకు, ఆటోలకు, ట్రాక్టర్లకు పార్టీ జెండాలు, ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో సేదతీరారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది.

ప్రభ బండ్ల వద్ద నేతల పూజలు



అమ్మవారి పుట్టినిల్లు కొల్లా వారి ఇంటి నుంచి పసుపు-కుంకుమ తీసుకువస్తున్న వంశీకులు



వైఎస్సార్‌సీపీ బండి వద్ద ఆపార్టీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పక్కన శివాజీ, పెంటయ్య

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్లలో భాగంగా పసుపు–కుంకమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అనిగండ్లపాడు వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు యానాల సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండ్లు వద్ద ఆపార్టీ నాయకులు పూజలు చేసి ప్రారంభించారు. పసుపు–కుంకుమ బండ్ల కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య పాల్గొని బండ్ల వద్ద కొబ్బరికాయలు కొట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, సొసైటీ మాజీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షులు వట్టెం మనోహర్, నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, పూట్ల లక్ష్మయ్య, ఉన్నం శ్రీనివాసరావు, కందిమళ్ల వెంకటరమణ, శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి పాల్గొన్నారు. అదేవిధంగా అమ్మవారి బండిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను సందర్శించి పూజలు చేశారు. పెనుగంచిప్రోలులో అమ్మవారి తోటికోడలు చంద్రమ్మ అమ్మవారి పసుపు–కుంకుమ బండ్ల కార్యక్రమంలో భాగంగా కన్నేటి వెంకటరమణ ఇంటి వద్ద కూడా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా



కలెక్టర్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎంపీడీఓ నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ నితిన్, హెల్త్ సూపర్‌వైజరట్ వెంకట్రావ్, హౌసింగ్, వెలుగు సిబ్బంది మాత్రమే హాజరుకాగా, మిగిలిన శాఖల సిబ్బంది డుమ్మా కొట్టారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముగ్గురు వ్యక్తులు అర్జీలు అందజేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కలెక్టర్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు కూడా ఆయాశాఖల అధికారులు డుమ్మా కొట్టడం గమనార్హం. అదేవిధంగా జగ్గయ్యపేట పట్టణంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారానికి సైతం ఆయాశాఖల అధికారులు సమయపాలన పాటించకుండా తీరుబడిగా హాజరయ్యారు. కార్యక్రమం ఉదయం పదిగంటలకు ప్రారంభం కాగా, 12గంటల సమయంలో ఏపీఓ, ఈవోపీఆర్డీ హాజరయ్యారు. అదేవిధంగా ఇరిగేషన్ ఏఈ, విద్యుత్, పీఆర్, ఐసీడీఎస్ శాఖల అధికారులు మధ్యాహ్నం ఒంటి గంటకు హాజరుకావడం గమనార్హం. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొడుతుండటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

జగ్గయ్యపేట అర్బన్: పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేసి వారి సొంతింటి కల నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాలు ఇస్తామంటూ కూటమి ప్రభుత్వ మంత్రివర్గ తీర్మానం మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ప్రజలతో కలసి సీపీఐ నాయకులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం అర్జీలను అందజేశారు. ఈసందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పేదవాడి పక్షాన ఎర్రజెండా పోరాడుతూనే ఉంటుందన్నారు. ఇనాం భూముల్లో ఉన్నవారికి పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం వెయ్యిమందికి పైగా పాల్గొని అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చుండూరు సుబ్బారావు, కార్యవర్గ సభ్యుడు బుట్టి రాయప్ప, నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్, అసదుల్లా, జిల్లా ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కరిసె మధు, వత్సవాయి మండల సీపీఐ కార్యదర్శి జానీ, నాయకులు మెటికల శ్రీనివాసరావు, భోగ్యం నాగులు, యంద్రపల్లి భాను, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బ్యాంక్‌ల సమ్మెను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిలువరించడానికి, డిమాండ్ల పరిష్కారానికి యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యాన ఈ నెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు దేశ వ్యాప్తంగా చేపట్టిన బ్యాంకు సమ్మెను బ్యాంకు ఉద్యోగులు జయప్రదం చేయాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్(ఎన్‌సీబీఈ) కౌన్సిల్ మెంబర్ వీఎస్ఆర్ శేఖర్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగా బ్యాంకింగ్ రంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందన్నారు. అన్ని కేడర్లలో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో 10లక్షలుగా ఉన్న బ్యాంక్ ఉద్యోగ అధికారులు ఏడున్నర లక్షలకు తగ్గిపోయారన్నారు. దీంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే అన్ని కేడర్లలో ఉన్న ఉద్యోగ ఖాళీలకు నూతన నియామకాలు చేపట్టి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీఈఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, ఏఐబీఓసీ సెక్రటరీ ఎండి అజీమ్‌బాషా మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి 9 బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే సమ్మెలో బ్యాంక్ అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు

నందిగామటౌన్: సమస్యలను అర్జీల ద్వారా తమదృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ 11 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఐదు అర్జీలు, సర్వే కోసం రెండు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రెండు, వ్యవసాయశాఖ, మున్సిపల్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు వివరించారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు.

బార్ ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 27వ తేదీన జరగనున్న జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి సోమవారం నుంచి నామినేషన్లు దాఖలు ప్రారంభమైంది. అయ్యాయని, మొదటి రోజున పలువురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎలక్షన్ అధికారి కొల్లి మార్షల్ స్టాలిన్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ కుందెన శ్రీనివాసరావు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా అన్నెపాగ సుందరరావు, వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.వీరాంజనేయులు నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు. నామినేషన్ల దాఖలు గడువు మంగళవారంతో ముగియనుందని వారు వివరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కంచికచర్ల: స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం(రామాలయం) పునః ప్రతిష్ట వార్షికోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, స్నపన అధివాసము, ప్రధాన హోమములు, నవగ్రహ పూజలు తదితర పూజలు చేశారు. మంగళవారం కూడా స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి తారంబాబు తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలి: సీపీఎం



వీరులపాడు: ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా సీపీఎం నాయకులు సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట కళ్యాణ్ మాట్లాడుతూ మాట్లాడుతూ 50 సెంట్ల స్థలంలో నిర్మించిన హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాట్ల రవి, నండ్రు తిరుపతిరావు, అద్దంకి స్వామి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేతలకు బహుమతులు

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రా లయోల కాలేజీలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ విన్నర్ ట్రోఫీని కె.భావన్, రన్నర్ ట్రోఫీని జె.మల్లేశ్వరరావు అందుకున్నారు. వైఈఎస్–జె ఆధ్వర్యంలో మ్యాజిక్ యూత్ నిర్వహించిన పోటీలు రసవత్తరంగా సాగాయి. టోర్నీలో మూడో స్థానాన్ని ఎం.బాబుశామ్యూల్ సాధించాడు. కాలేజీ ఆవరణలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఉమెన్ గ్రాండ్ మాస్టర్ నూతక్కి ప్రియాంక విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు.